సాక్షి
వనపర్తి
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



డీఎల్‌పీఓ విచారణ
భోలేవల్లి జీపీలో రికార్డుల టాంపరింగ్, అక్రమాలపై డీఎల్‌పీఓ విచారణ చేపట్టారు.
వివరాలు 8లో ▸



వన్యప్రాణులను సంరక్షిద్దాం
వన్యప్రాణుల సంరక్షణ చర్యలను రెస్క్యూ టీం సభ్యులు వివరించారు.
వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.3 /22.9
వాతావరణం
ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువ అయ్యే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సాంస్కృతిక పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తిటౌన్: జిల్లా స్థాయి సాంస్కృతిక పోటీలు ఈ నెల 26న ఉదయం 9 గంటల నుంచి జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడాల అధికారి సుధీర్‌కుమార్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పోటీల్లో 15 నుంచి 29 సంవత్సరాల వయస్సు కలిగిన వారే అర్హులని చెప్పారు. జానపద నృత్యం, జానపద గీతాలు, వ్యాసరచన, పోస్టర్ మేకింగ్, కవిత్వం, యువ క్రితి, ఉపన్యాస పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు జిల్లా యువజన, క్రీడల కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. దరఖాస్తుల సమర్పణలో ఏవైనా ఇబ్బందులు ఉంటే 9885851813, 9959205995 నంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

తెగిన కాల్వకు మరమ్మతు చేయిస్తాం..

వీపనగండ్ల: అకాల వర్షాలతో దెబ్బతిన్న భీమా కాల్వలకు వెంటనే మరమ్మతు చేయిస్తామని భీమా ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కల్వరాళ్ల గ్రామ సమీపంలో తెగిన భీమా కాల్వను ఆయన పరిశీలించారు. కాల్వలు తెగిపోవడంతో రైతుల పంటలకు సాగునీరు అందడం కష్టమవుతుందని, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి అవసరమైన నివేదికలు ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలియజేశారు. కాల్వలను ధ్వంసం చేయకుండా రైతులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈఈ కేశవరావు, ఏఈ దేవరాజ్, కిషోర్ కుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

'కార్మికులపై చిత్తశుద్ధి లేని కేంద్ర ప్రభుత్వం'

వనపర్తి: రాష్ట్రంలో వివిధ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ వర్కర్స్‌కు ఇచ్చే పీఎఫ్, ఈఎస్‌ఐ జాప్యం చేసే యాజమాన్యం, ఏజెన్సీలకు విధించే జరిమానాను కేంద్ర ప్రభుత్వం తగ్గించే యోచన చేస్తుందని, కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాన్ని వెంటనే విరమించుకోవాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులతో బుధవారం ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనేక పోరాటాలు, త్యాగాలు చేసి కార్మికవర్గం సాధించుకున్న కార్మిక సంక్షేమ చట్టాలను కేంద్ర ప్రభుత్వం సవరణల పేరుతో ఒక్కొక్కటిగా కంపెనీల యాజమాన్యాలకు, కాంట్రాక్టర్లకు దోచిపెట్టేలా చట్టాలను మారుస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా మారుస్తూ.. పార్లమెంట్‌లో చట్టం తీసుకొచ్చి గెజిట్ చేయడంతోనే ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వానికి కార్మికుల సంక్షేమంపై ఎలాంటి చిత్తశుద్ధి ఉందో బయటపడిందన్నారు. శ్రీను, నరసింహ, స్వామి, షాబాబ్, కళావతమ్మ, లక్ష్మీ, పార్వతమ్మ పాల్గొన్నారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో



ధరూరు/అత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో అతి స్వల్పంగా ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రానికి 18, 500 క్యూసెక్కులు మాత్రమే ఉన్నట్లు వివరించారు. విద్యుత్ ఉత్పత్తికి 15,120 క్యూసెక్కుల నీరు వినియోగిస్తున్నారు. మొత్తంగా 18,385 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.583 టీఎంసీల నీరు ఉంది. కాగా కేవలం నాలుగు యూనిట్లలోనే విద్యుత్ ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువలో 2 యూనిట్ల ద్వారా 78 మెగావాట్లు, 181.979 ఎంయూ, దిగువలో 2 యూనిట్ల ద్వారా 80 మెగావాట్లు, 154.815 ఎంయూ విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు. ఇప్పటివరకు 336.794 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి సాధించామని తెలిపారు.

శ్రీశైలంలో నీటిమట్టం 880.6 అడుగులు

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో బుధవారం నీటిమట్టం 880.6 అడుగుల వద్ద 191.2118 టీఎంసీలుగా ఉంది. మొత్తంగా జలాశయానికి 21,879 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. భూగర్భ కేంద్రం, ఏపీ జెన్‌కో పరిధిలో విద్యుత్ ఉత్పత్తికి మొత్తం 67,156 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. గత 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డి పాడు ద్వారా 35,000 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,480, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 2,239 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.879 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 14.697 మి.యూనిట్లు ఉత్పత్తి చేశారు. జలాశయంలో 148 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

బదిలీలు పూర్తి



శ్రీరంగాపురం మండలంలోని కేజీబీవీలో విద్యార్థినులకు డిజిటల్ పాఠాలు బోధిస్తున్న సీఆర్‌టీ

జిల్లాకు వచ్చింది 10 మంది సీఆర్‌టీలు
- ఇతర జిల్లాలకు వెళ్లింది ఆరుగురు
- కేజీబీవీల్లో మొత్తం సీఆర్‌టీలు 170 మంది
- జిల్లాలో 15 కేజీబీవీలు, 5 ఇంటర్ కాలేజీలు



వనపర్తి కేజీబీవీలో విద్యార్థినులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్(ఫైల్)

అమరచింత: జిల్లాలోని కేజీబీవీల్లో బదిలీల ప్రక్రియ పూర్తి కావొచ్చింది. జిల్లా మొత్తంగా ఇప్పటి వరకు 170 మంది సీఆర్‌టీలు విధులు నిర్వహిస్తున్నారు. బదిలీల ప్రక్రియతో సొంత జిల్లాలో బదిలీలతో పాటు కొంత మంది సీఆర్‌టీలు ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లినట్లు అధికారులు వెల్లడించారు. కేజీబీవీలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం నిరంతరం నిధుల విడుదలతో పాటు పాఠశాలలో సౌకర్యాలను సమకూరుస్తుంది. ఇందులో భాగంగానే కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన బదిలీల ప్రక్రియకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కేజీబీవీల్లో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌టీలు తమకు దగ్గరగా ఉన్న కేజీబీవీలకు బదిలీ కోసం ప్రయత్నాలు చేసి, తమకు అనుకూలంగా ఉన్న పాఠశాలలకు వెళ్లారు. దీంతో కొత్తగా బదిలీపై వచ్చిన సీఆర్‌టీలు సైతం విధుల్లో చేరి విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారని జీసీడీఓ వెల్లడించారు. ఇకపై విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలపై దృష్టి సారిస్తూ.. వారిని చదువుల్లో రాణించే స్థాయికి తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా ప్రణాళిక రూపొందించామని, ఇకపై వీటిపైనే దృష్టి సారిస్తున్నట్లు తెలియజేశారు.

మొత్తం 4,400 మంది విద్యార్థినులు

బదిలీలు ఇలా..

జిల్లాలో కేజీబీవీల్లో జరిగే బదిలీ ప్రక్రియలో మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్‌గా 1, సొంత జిల్లాలో బదిలీలు చేసుకుంది 4, ఇతర జిల్లాల బదిలీల్లో ఆరుగురు సీఆర్‌టీలు బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం జిల్లాకు 10 మంది సీఆర్‌టీలు బదిలీపై వచ్చారని జీసీడీఓ తెలియజేశారు. మిగిలిన ఖాళీలను ఉన్నతాధికారుల అనుమతితో భర్తీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు వివరించారు.

మౌలిక సౌకర్యాల కల్పన..

ప్రభుత్వ ఆదేశాల మేరకు కేజీబీవీల్లో మౌలిక వసతులను గుర్తించి, వాటిని వెంటనే పూర్తి చేయడానికి అధికారులు సిద్ధమయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల వసతులతో పాటు కిటికీ తలుపుల మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తున్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు ఉన్నతమైన విద్యను అందించాలనే సంకల్పంతో నిర్విరామంగా కృషి చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని మండలాల్లో మొత్తంగా 15 కేజీబీవీలతో పాటు 5 ఇంటర్మీడియట్లు కొనసాగుతున్నాయి. వీటిలో 5 కేజీబీవీలు ఇంగ్లిష్ మీడియం కాగా.. మిగిలినవి తెలుగు మీడియంలో విద్యను అందిస్తున్నాయి. జిల్లా ఏర్పాటు అనంతరం, కొత్తగా ఏర్పడిన మండలాల్లో ప్రభుత్వం ఇంగ్లిష్ మీడియంలో కేజీబీవీలను కొనసాగించాలనే ఉద్దేశంతో జిల్లాలో కొత్తగా ఐదు కేజీబీవీలు ప్రారంభించారు. ఆయా కేజీబీవీల్లో మొత్తంగా ఇప్పటి వరకు 4,400 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారని అధికారులు తెలియజేశారు. ప్రతినిత్యం విద్యార్థులకు విద్యతో పాటు ప్రణాళిక బద్ధంగా రూపొందించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రతిరోజూ యోగా, ఆసనాలతో పాటు ధ్యానం, కరాటేతో తమకు తాము ఎలా రక్షించుకోవాలి, తమ ఆరోగ్యాలను ఎలా కాపాడుకోవాలి అనే విషయాలపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఉన్నతమైన విద్య అందిస్తున్నాం..



కేజీబీవీల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలను తీసుకొస్తున్నాం. విద్యాసంవత్సర ప్రారంభం నుంచి విద్యార్థినులకు విషయాల వారీగా బోధనలు కొనసాగుతున్నాయి. బదిలీల ప్రక్రియ పూర్తయిన తరువాత విద్యార్థినుల చదువుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.
– శుభలక్ష్మి, జీసీడీఓ

త్వరలోనే ఖాళీ పోస్టుల భర్తీ..



జిల్లాలో ఖాళీగా ఉన్న 15 పోస్టులను భర్తీ చేసేందుకు నివేదికను అధికారులకు పంపించాం. భర్తీలపై తమకు నివేదిక అందిన వెంటనే ఖాళీగా ఉన్న సీఆర్‌టీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వేస్తాం.
– గోవిందరాజులు, ఇన్‌చార్జ్ డీఈఓ

ఆరోగ్య శ్రీ సేవలకు ఆటంకం

- సమ్మెలోకి వెళ్లిన ఆరోగ్య మిత్రలు
- వేతనాలు పెంచడంతో పాటు కేడర్ పేరు డీపీఓ మార్పు చేయాలని డిమాండ్
- ఉమ్మడి జిల్లాలో 45 ఆస్పత్రుల్లో వైద్యసేవలపై ప్రభావం





జనరల్ ఆస్పత్రిలోని ఆరోగ్య మిత్ర సహాయ కేంద్రం

పాలమూరు: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవల్లో ఇబ్బందులు తలెత్తాయి. ఈ విభాగంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రలు సమ్మెకు పిలుపునివ్వడంతో ఆయా ఆస్పత్రుల్లో ఓపీతో పాటు ఐపీ సేవలకు అంతరాయం ఏర్పడింది. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఆరోగ్య మిత్ర లాగిన్ కాకుండా ఆయా ఆస్పత్రుల్లో ఉన్న వైద్యుల లాగిన్‌లో రోగుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయించి.. ఆ తర్వాత వైద్యసేవలు అందేవిధంగా ఏర్పాటు చేశారు. పాలమూరులో 45 ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో అత్యధికంగా మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రైవేట్ 14, ప్రభుత్వ ఆస్పత్రులు మూడు ఉండగా, నాగర్‌కర్నూల్‌లో పది, వనపర్తిలో 13, జోగుళాంబ గద్వాల జిల్లాలో 10, నారాయణపేటలో 12 ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు పని చేస్తున్నాయి. మొత్తం 94 మంది ఆరోగ్య మిత్రలు పని చేస్తున్నారు. 2007లో వీరికి నెలకు రూ.3,500 వేతనం ఇచ్చారు. 2012లో రూ.7,200లకు పెంచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015లో రూ.12,000 ఇచ్చింది. అదే ఏడాది పీఆర్‌సీ ప్రకారం రూ.15,600 ఇచ్చారు. అయితే పీఎఫ్, ఈఎస్‌ఐ పోనూ చేతికి రూ.13,330 మాత్రమే వస్తుండడంతో.. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.22,750కు పెంచాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు.

ఈ విభాగాలకు ఆరోగ్య శ్రీ సేవలు

పీహెచ్‌సీలలో జనరల్ సర్జరీ, గైనకాలజీ, అబ్‌స్టెట్రిక్ సర్జరీ, నెఫ్రాలజీ, ఆర్థోపెడిక్ సర్జరీ, ప్రొసీడ్యూర్స్, పీడియాట్రిక్స్, జనరల్ మెడిసిన్ తదితర విభాగాల్లో ఆరోగ్య శ్రీలో వైద్యం చికిత్సలు అందిస్తున్నారు. ఆరోగ్య శ్రీలో వైద్యంతో వచ్చే నిధుల్లో 30 శాతం ఆస్పత్రి అభివృద్ధికి మిగతా మొత్తాన్ని వైద్యం చేసిన వైద్యులకు, సిబ్బందికి ఇతర ఖర్చులకు వాడుతున్నారు.

ఆరోగ్య మిత్రల డిమాండ్లు

- ఆరోగ్య మిత్రలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ కేడర్ కల్పించాలి.
- జీఓ 60 ప్రకారం వేతనం రూ.22,750అమలు చేయాలి.
- ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా నేరుగా ట్రస్ట్ ద్వారా చెల్లించాలి
- కాంట్రాక్ట్ విధానంలోకి మార్పు చేయాలి
- రాబోయే పీఆర్‌సీలో కనీస వేతనం రూ.35,000లతో పాటు టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలి
- షఫ్లింగ్ విధానాన్ని రద్దు చేయాలి
- ఉద్యోగులందరికీ హెల్త్‌కార్డుల సౌకర్యం కల్పించాలి.

డిమాండ్లు పరిష్కరించాలి..



ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఆరోగ్య మిత్రల డిమాండ్లను పరిష్కరించాలి. ఆరోగ్యశ్రీతో పాటు ఈహెచ్‌ఎస్, జర్నలిస్టు ఆరోగ్య సంక్షేమం, ఆయుష్మాన్‌భారత్ వంటి వైద్యసేవల పథకాల కోసం పని చేస్తున్నాం. కేడర్ మార్పుతో పాటు వేతనాల పెంపు వెంటనే చేయాలి. ప్రస్తుతం ఆరోగ్య మిత్రలకు లిఫ్ట్ ఆపరేటర్ హోదా ఉంది.. దానిని డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్‌గా మార్పు చేయాలి.
– ప్రదీప్‌కుమార్, అసోసియేట్ ప్రెసిడెంట్

సేవలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..

ఆరోగ్య మిత్రలు సమ్మెలోకి వెళ్లిన క్రమంలో ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యశ్రీ సేవలకు అంతరాయం లేకుండా చూస్తున్నాం. ఆరోగ్య మిత్ర లాగిన్ కాకుండా ఆయా ఆస్పత్రుల్లో ఉన్న వైద్యుల లాగిన్‌లో రోగుల వివరాలు రిజిస్ట్రేషన్ చేసుకుని వైద్యసేవలు అందేవిధంగా చూస్తున్నాం. వైద్యుడి లాగిన్‌లో స్లాట్ బుక్ చేసిన తర్వాత సేవలు అందుతాయి.
– డాక్టర్ స్వప్న, ఆరోగ్య శ్రీ కో–ఆర్డినేటర్

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజా సంక్షేమం



ఖిల్లాఘనపురంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు

ఖిల్లాఘనపురం: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి పనులు చేపడుతుందని, తమతోనే ప్రజాసంక్షేమం సాధ్యమవుతుందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీటీ రోడ్డు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఖిల్లాఘనపురం మండలం నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడిందన్నారు. ఆర్‌అండ్‌బీ నిధులు రూ.6.60 కోట్ల నిధులతో ఖిల్లాఘనపురం నుంచి సోళీపురం వరకు 10 కిలోమీటర్ల మేరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. పనులు వేగంగా నాణ్యతతో చేపట్టేలా చర్యలు తీసుకునేలా అధికారులకు సూచనలు చేశామన్నారు. ఈ రోడ్డు పనులు పూర్తయితే వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాలకు ఖిల్లాఘనపురం మండల కేంద్రం మీదుగా తక్కువ సమయంలో వెళ్లేందుకు వీలుంటుందన్నారు.

మాట్లాడే అర్హత లేదు..

ఢిల్లీకి చెందిన బీజేపీ నాయకుడు మాజీ ఎమ్మెల్యే తన్వీర్‌సింగ్ రాహుల్ గాంధీని విమర్శిస్తూ.. అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ.. బుధవారం ఎమ్మెల్యే మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి బస్టాండ్‌లో బీజేపీ నాయకుడి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాబోయే ప్రధాని రాహుల్‌గాంధీ అన్నారు. అలాంటి వ్యక్తిని బయటకు వస్తే చంపేస్తామని, ఇందిరాగాంధీకి పట్టిన గతే ఆయనకు పడుతుందని వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, వెంకటేశ్వర్‌రావు, ప్రకాష్, శ్యాంసుందర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

డీఈడీ పరీక్షలు ప్రారంభం

వనపర్తిటౌన్: డీఈడీ సెకండ్ ఇయర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని లిటిల్‌బడ్స్ స్కూల్ పరీక్ష కేంద్రాన్ని చీఫ్ సూపరింటెండెంట్ ఎం.శంకరయ్య పరిశీలించారు. పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు ఉండకుండా చూడాలన్నారు. తాగునీటి, మూత్రశాలలు శుభ్రంగా ఉంచాలని స్కూల్ ప్రిన్సిపాల్‌కు సూచించారు. పరీక్షలు ఈ నెల 24వ తేదీ వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ దక్షణమూర్తి, సీసీ బాలనాగయ్య, ఏసీజీఈ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైన్స్‌ఫేర్‌కు విద్యార్థి ఎంపిక



నిఖిల్‌కుమార్

ఆత్మకూర్: సైన్స్‌ఫేర్ పోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన తిప్డంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థి నిఖిల్‌కుమార్ జాతీయస్థాయి సైన్స్‌ఫేర్ పోటీలకు ఎంపికయ్యాడు. న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ సైన్స్‌ఫేర్‌లో స్మార్ట్ బ్యాండేజ్ అంశంపై వివరించనున్నట్లు గైడ్ ఉపాధ్యాయుడు అరవింద్ తెలయజేశారు. జీహెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ నిఖిల్‌కుమార్‌ను అభినందించారు.

సంపూర్ణ పారిశుద్ధ్య పట్టణంగా మార్చుకుందాం..



రహదారిని శుభ్రపరుస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కమిషనర్ సిబ్బంది

అమరచింత: పట్టణాన్ని సంపూర్ణ పారిశుద్ధ్య పట్టణంగా మార్చుకుందామని, ప్రతిఒక్కరూ మున్సిపల్ చేసే పనులకు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్, గోపి కోరారు. ప్రధాన రహదారిలోని గాంధీ విగ్రహ సమీపంలో బుధవారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు మున్సిపల్ సిబ్బందితో కలిసి రహదారులపై చెత్తను ఊడ్చి చెత్త బండిలో వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చేనెల ఒకటో తేదీ వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలను పట్టణంలోని అన్ని వార్డుల్లో చేపడుతున్నామన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనతో పాటు కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. మురుగు నీటి నిల్వలతో దోమలు పెరగటం, వాటితో ప్రజలు రోగాల భారిన పడుతున్నారని, నీటినిల్వ గుంతలను మట్టితో పూడ్చివేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వచ్ఛ మున్సిపాలిటీగా మార్చుకునే యత్నంలో పట్టణ ప్రజలు యువకులు స్వచ్ఛందంగా స్వచ్ఛత కార్యక్రమల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీంతో పాటు మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త హైవేలు?

ఉమ్మడి జిల్లాలో ఐదు జాతీయ రహదారులకు ప్రతిపాదనలు
- ప్రధాన ప్రాంతాలు, రహదారులను అనుసంధానించేలా ప్రణాళిక
- ఇప్పటికే హైదరాబాద్–శ్రీశైలం రోడ్డు విస్తరణకు గ్రీన్ సిగ్నల్
- మరింత మెరుగుపడనున్న రవాణా సౌకర్యం



హైదరాబాద్–శ్రీశైలం జాతీయ రహదారి

అచ్చంపేట: ఉమ్మడి జిల్లాలో కొత్త జాతీయ రహదారులపై ఆశలు రేకెత్తుతున్నాయి. ఇప్పటికే హైదరాబాద్–బెంగళూరు ఎన్‌హెచ్–44ను రూ.5,600 కోట్లతో ఎక్స్‌ప్రెస్ హైవే (ఆరు వరుసలు)గా విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం భూసేకరణ కూడా పూర్తిచేశారు. తాజాగా 12 వరుసల గ్రీన్ కారిడార్‌గా విస్తరించేందుకు కేంద్రం యోచిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించడం.. ఎన్‌హెచ్–44కు అనుసంధానంగా కొత్త జాతీయ రహదారుల నిర్మాణాలకు ప్రతిపాదించడం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు వరంగా భావిస్తున్నారు. రవాణా రంగం మరింత ఊపందుకునే అవకాశాలు ఉండటంతో పాటు పెద్దఎత్తున పరిశ్రమలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆశిస్తున్నారు. ఇదిలా ఉంటే, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం ఏర్పాటు, రేడియల్ రోడ్లతో పాలమూరు స్వరూపం మారే అవకాశం ఉంది.

కొనసాగుతున్న డీపీఆర్ సర్వే..

హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారి 765 విస్తరణకు కేంద్రం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం ఉన్న రెండు వరుసల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు రెండేళ్ల క్రితం కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు డీపీఆర్ సర్వే కొనసాగుతోంది. శ్రీశైలం రహదారి విస్తరణతో జిల్లా రూపురేఖలు మారే అవకాశాలు ఉన్నాయి. మహేశ్వరం గేట్ నుంచి కల్వకుర్తి, డిండి లేదా హాజీపూర్ వరకు నాలుగు వరుసలుగా విస్తరించే అవకాశం ఉంది. ఈ రహదారికి అనుసంధానంగా గుర్తించి నిర్మిస్తున్న కల్వకుర్తి–నంద్యాల ఎన్‌హెచ్–167 పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సోమశిల వద్ద తీగల వంతెన, రహదారి పనులు పూర్తయితే తిరుపతికి సుమారు 80 కి.మీ. దూరం తగ్గుతుంది.

అటవీ ప్రాంతంలో ఎలివేటెడ్ కారిడార్?

హైదరాబాద్–శ్రీశైలం రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించేందుకు, అమ్రాబాద్ టైగర్ రిజర్వులో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 2022–23లోనే కేంద్ర ప్రభుత్వం డీపీఆర్ తయారీకి రూ.3 కోట్లు మంజూరు చేసింది. నల్లమల అభయారణ్యంలో పెద్దపులుల సంచారం ఎక్కువ. వన్యప్రాణులు రాకపోకలు సాగించే సమయంలో జాతీయరహదారిని దాటేందుకు సహజసిద్ధ వాతావరణం కల్పిస్తూ ఎకో బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. అందుకు రూ.7,700 కోట్లు ఖర్చయ్యే అవకాశం ఉంది.

ప్రతిపాదిత రహదారులు ఇలా..

- మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూరు నుంచి మన్ననూర్, మద్దిమడుగు మీదుగా సిరిగిడిపాడు (ఆంధ్రప్రదేశ్) వరకు 166 కి.మీ. రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా మార్చాలని ప్రతిపాదించారు. ఈ రహదారి నిర్మాణంతో మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రవాణా పరంగా అనువుగా ఉంటుందని.. దక్షిణ కాశీగా పిలిచే శ్రీశైలం క్షేత్రం, మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయాలకు ప్రాధాన్యత లభిస్తుందని భావిస్తున్నారు. ఉమామహేశ్వరం, మల్లెల తీర్థం, లొద్దిమల్లయ్య, సలేశ్వరం పుణ్యక్షేత్రాలతో పాటు పర్యాటకంగా విరాజిల్లుతున్న నల్లమలకు రాష్ట్ర నలుమూలల నుంచి సులభంగా చేరుకునే అవకాశం ఉంటుంది.
- జోగుళాంబ గద్వాల జిల్లా పుల్లూరు, అలంపూర్, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్, అచ్చంపేట మీదుగా నల్లగొండ హైవే వరకు వరకు 225 కి.మీ. రహదారి నిర్మాణానికి ప్రతిపాదించారు. ఈ రహదారి 44, 167కే, 765, 176, 167, 565 నేషనల్ హైవేలకు అనుసంధానం కానుంది. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్, ఇరిగేషన్ ప్రాజెక్టుల సందర్శన సులభతరంగా మారనుంది.
- వనపర్తి నుంచి కొత్తకోట మీదుగా మంత్రాలయం (ఎన్‌హెచ్–167) వరకు 110 కి.మీ., నారాయణపేట జిల్లాలోని మరికల్, నారాయణపేట మీదుగా రామసముద్రం (ఎన్‌హెచ్ – 150) వరకు 63 కి.మీ., జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి (ఎన్‌హెచ్–44) నుంచి గద్వాల మీదుగా రాయచూర్ (ఎన్‌హెచ్– 167) వరకు 67 కి.మీ. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

మద్దిమడుగు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి సాధిస్తాం..



తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ నడుమ మద్దిమడుగు వద్ద కృష్ణానదిపై బ్రిడ్జి నిర్మాణం ఆవశ్యకతను ఏపీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు దృష్టి పెడుతున్నారు. ఎంతో కాలంగా ప్రతిపాదనల్లో ఉన్న భూత్పూర్, శ్రీశైలం మీదుగా సిరిగిరిపాడు 565 జాతీయ రహదారి ఏర్పాటుతో మద్దిమడుగు బ్రిడ్జి ఏర్పాటు ఆకాంక్ష నెరవేరుతుందని ఆశిస్తున్నాం.
– డా. చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్యే, అచ్చంపేట

కేంద్రాన్ని కోరాం..



రాష్ట్ర ప్రభుత్వం 16 రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపింది. అందులో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో నాలుగు రోడ్లు ఉన్నాయి. ఇప్పటికే రహదారుల మంజూరును కోరుతూ కేంద్ర మంత్రులను కలిశాం. ప్రతిపాదనల్లో ఉన్న భూత్పూరు–సిరిగిరిపాడు(ఏపీ), అలంపూర్ చౌరస్తా–చిన్నంబావి, కొల్లాపూర్, అచ్చంపేట, నల్లగొండ, వనపర్తి–మంత్రాలయం, గద్వాల–రాయచూరు రహదారులు మంజూరయ్యే అవకాశం ఉంది.
– మల్లురవి, ఎంపీ, నాగర్‌కర్నూల్

క్లుప్తంగా

వినాయక నిమజ్జనంలో అపశృతి

● ముడుమాల్ నదిలో వ్యక్తి మృతి

కృష్ణా: మండలంలోని ముడుమాల్ పుష్కర ఘాట్‌లో బుధవారం సాయంత్రం వినాయకుని నిమజ్జనంలో పాల్గొన్న వ్యక్తి ప్రమాదవశాత్తు నదిలో పడి మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మాగనూర్ మండలంలోని కొల్పూర్ గ్రామానికి చెందిన పుట్టి తాయప్ప(27), గ్రామ యువకులతో కలిసి వినాయకుని నిమజ్జనానికి నదికి వెళ్లాడు. వినాయకుని నదిలో ముంచే సమయంలో వినాయకునితో పాటూ తాయప్ప నదిలోకి వెళ్లిపోయాడు. అప్పటికే ఆయన మద్యం మత్తులో ఉండడం, కాళ్లకు బరువైన బూట్లు ఉండడం వల్లా నదిలో ఈతకొట్టేందుకు ప్రయత్నించినా ఉపయోగం లేకపోయింది. ఆ తరువాత నదిలో మునిగిపోయాడు. అక్కడే ఉన్న మిగితా స్నేహితులు స్పందించి పది నిమిషాల్లోనే అతన్ని నది ఒడ్డుకు తీసుకొచ్చి, ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వ్యక్తి బలవన్మరణం


జలాల్ సాహెబ్ (ఫైల్)

కల్వకుర్తి టౌన్: తల్లి భూమిపైన క్రాప్‌లోన్ ఇప్పించేందుకు నిరాకరించటంతో మనస్థాపానికి గురైన వ్యక్తి బలవన్మరణం చేసుకున్న సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి, కుటుంబ సభ్యులు వివరాల ప్రకారం.. తిమ్మాజిపేట మండలం సిర్సవాడకు చెందిన జలాల్ సాహెబ్(47) కుటుంబంతో కల్వకుర్తి పట్టణంలోని హైదర్‌పురా కాలనీలో ఉంటున్నాడు. వీడియోగ్రాఫర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించిన నేపథ్యంలో ఈ నెల 16న తన తల్లికి చెందిన భూమిపై క్రాప్‌లోన్ ఎత్తి తనకు ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. తాగుడుకు బానిస కావటంతో తల్లి క్రాప్‌లోన్ తీసి ఇవ్వడానికి నిరాకరించింది. దీంతో మనస్థాపానికి గురైన సాహెబ్ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతనికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. అతని తండ్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. బాధిత కుటుంబానికి మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ రూ.5వేలు అందజేశారు. అతని భార్య అష్మాదాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కుమార్తె అదృశ్యం.. తల్లి ఆత్మహత్య

హన్వాడ: కుమార్తె కనిపించకుండా పోవడంతో.. కన్నతల్లి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం శేక్‌పల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నర్సమ్మ(40) కుమార్తె రెండు రోజుల క్రితం ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో నర్సమ్మ బంధువులు, గ్రామంలో ఆచూకీ కోసం వెతికినా ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో నర్సమ్మ తీవ్ర మనస్తాపానికి గురైంది. మంగళవారం సాయంత్రం తమ పక్క పొలంలో చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఘటనపై ఆమె మొగులయ్య ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటేశ్ పేర్కొన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు..

నాగర్‌కర్నూల్ క్రైం: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పట్టణ రెండో ఎస్‌ఐ రమాదేవి కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని సంత బజార్ కాలనీకి చెందిన మెహబూబా బేగం (52)పై భర్త అబ్దుల్ హమీద్ ఈనెల 16న కర్రతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. కాగా చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అనంతరం తిరిగి నాగర్‌కర్నూల్‌కు తీసుకువచ్చారు. ఈ క్రమంలో ఆమె పరిస్థితి విషమించడంతో మరోమారు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రికి తరలించగా.. మంగళవారం అర్ధరాత్రి అక్కడే మృతి చెందారు. ఘటనపై ఆమె కుమారుడు అబ్దుల్ వాజిద్ ఫిర్యాదు చేయడంతో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

యువకుడు మృతి : కేసునమోదు



ఎర్రవల్లి: యువకుడి మృతిపై కేసు నమోదైన ఘటన బుధవారం ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ కథనం ప్రకారం.. ఎర్రవల్లికి చెందిన ఉప్పరి విష్ణు (35) కుటుంబ సభ్యులు ఇతర గ్రామానికి వెళ్లడంతో ఒక్కడే రాత్రి భోజనం చేసి ఇంట్లో నిద్రపోయాడు. ఈ క్రమంలో ఇతర గ్రామానికి వెళ్లిన భార్య విష్ణుకు మరునాడు ఉదయం ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో ఆమె స్థానికులకు సమాచారం ఇచ్చి ఇంటికి వెళ్లి చూడమని చెప్పింది. వారు వెళ్లి చూడగా ఇల్లు మూసుకొని ఉంది. తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే విష్ణు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. దీంతో వారు చికిత్స నిమిత్తం అతడిని గద్వాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కాగా విష్ణుకు భార్య అనితతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

సాగర్‌ను చూస్తానని వెళ్లి.. మృత్యుఒడికి

● దయ్యాల గండి వద్ద కారును ఢీకొట్టిన సిమెంట్ లారీ
● మహిళా కానిస్టేబుల్ దుర్మరణం
● ఆమెకు కాబోయే జీవిత భాగస్వామికి గాయాలు


లారీ వెనుక నుంచి ఢీకొని ముందుకు తోయడంతో తుక్కుతుక్కయిన కారు

కేటీదొడ్డి/నాగార్జునసాగర్: సాగర్‌ను చూస్తానని వచ్చి ఓ మహిళా కానిస్టేబుల్ దుర్మరణం చెందగా, ఆమెకు కాబోయే జీవిత భాగస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లాలోని హైదరాబాద్–నాగార్జునసాగర్ హైవేపై దయ్యాల గండి వద్ద బుధవారం చోటు చేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గద్వాల పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చేపల శ్రావణి(27)కి టాటాకంపెనీలో పనిచేస్తున్న మహబూబ్‌నగర్‌కు చెందిన జి.ప్రశాంత్‌తో ఇటీవలనే ఎంగేజ్‌మెంట్ అయింది. వీరికి నవంబర్‌లో వివాహం కావాల్సి ఉంది. ప్రశాంత్ కంపెనీ పని మీద హాలియాకు రావాల్సి ఉండగా గద్వాల నుంచి


చేపల శ్రావణి (ఫైల్)


చికిత్స పొందుతున్న జి.ప్రశాంత్

ఇరువురు కారులో బయలుదేరారు. మార్గమధ్యలో శ్రావణి కోరిక మేరకు సాగర్‌ను సందర్శించి తిరిగి హాలియాకు వెళ్తున్నారు.

అప్పటికే రెండు కార్లు ఢీకొని..

ప్రశాంత్ కారు దయ్యాల గండి మూలమలుపు వద్దకు చేరుకోగానే అప్పటికే అక్కడ రెండు కార్లు ఒకదానికి ఒకటి స్వల్పంగా ఢీకొనడంతో ఆయా వాహనాల డ్రైవర్లు తగువుపడుతున్నారు. దీంతో హైవేకు ఇరువైపులా పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. ప్రశాంత్ కారు కూడా ప్రమాదం జరిగిన రెండు కార్ల వెనక నిలిచిపోయింది. ప్రశాంత్ కారు వెనుక కూడా మరో కారు ఉంది. ఈ క్రమంలోనే మాచర్ల నుంచి హైదరాబాద్‌కు సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ అతివేగంగా వచ్చి తొలుత ప్రశాంత్ వెనుక ఉన్న కారును స్వల్పంగా ఢీకొట్టగా అది పక్కకు తొలగిపోయింది. అనంతరం లారీ ప్రశాంత్ కారును వేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో లారీ ప్రశాంత్ కారుపైకి ఎక్కడంతో నుజ్జునుజ్జయ్యింది. అందులో చిక్కుకున్న ప్రశాంత్, శ్రావణిని పోలీసులు అరగంట పాటు శ్రమించి క్రేన్ సమయంతో బయటకు తీశారు. అప్పటికే శ్రావణి మృతి చెందగా, ప్రశాంత్ గాయాలతో బయటపడ్డాడు. త్వరలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన మహిళను లారీ రూపంలో మృత్యువు కబళించడం చూపరులను కలచివేసింది. ఈ మేరకు సాగర్ సీఐ బీసన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామంలో విషాదం

నల్లగొండ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ శ్రావణి స్వగ్రామం వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం యాపర్ల. ఆమె 2020లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. తొలుత వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. అనంతరం 2021లోని కేటీదొడ్డి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి అక్కడే ఉన్నారు. శ్రావణి రోడ్డు ప్రమాదంలో మరణించడం ఎంతో బాధాకరమని జోగుళాంబ గద్వాల ఎస్పీ టి.శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆమె కుటుంబసభ్యులకు ప్రగాడ సానుభూతి ప్రకటించిన ఆయన వారికి అండగా ఉంటామని తెలిపారు. శ్రావణి మరణంతో యాపర్లలో విషాదం అలుముకుంది.

పోలేపల్లి రికార్డులపై డీఎల్‌పీఓ విచారణ


పోలేపల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ పాండురంగయ్య

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి గ్రామ పంచాయతీలో రికార్డుల టాంపరింగ్‌తో పాటు జరిగిన అక్రమాలపై బుధవారం జిల్లా డీఎల్‌పీఓ పాండురంగయ్య విచారణ చేపట్టారు. ఎంపీఓ సరోజతో కలిసి ఆయన పోలేపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఇంతకుముందు పనిచేసిన కార్యదర్శి శివప్రకాశ్‌లతో విచారణకు చేశారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన రికార్డులు అందించకుండా గోల్‌మాల్ చేస్తున్నారని, టాంపరింగ్‌కు పాల్పడుతున్నారని స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆ ఫిర్యాదు ఆధారంగా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీంతో డీఎల్‌పీఓ బుధవారం క్యాష్‌బుక్‌లను పూర్తిస్థాయిలో పరిశీలించాలని నిర్ణయించారు. ఎంబీలు నమోదు చేయకుండా కేవలం ఓచర్లతోనే డబ్బులు ఖర్చు చేసినట్లుగా చూపించినట్లు గుర్తించారు. ఐదేళ్లకాలంలో తాజా మాజీ పాలకవర్గం రూ.5కోట్ల వరకు ఖర్చులు చేసినట్లు పేర్కొన్నారు. దానికి సంబంధించి కేవలం ఓటర్లు మాత్రమే ఉండగా, అవి టాంపరింగ్‌కు గురైనట్లు ఎమ్మెల్యే ఫిర్యాదు చేయడంతో విచారణ ఉత్కంఠగా మారింది. రెండు నెలల క్రితం రంగారెడ్డిగూడ నుంచి బదిలీపై వచ్చిన కార్యదర్శి లక్ష్మీనారాయణ రికార్డులు సక్రమంగా లేవని, గత కార్యదర్శి శివప్రసాద్‌తో స్వీకరించలేదు. క్యాష్‌బుక్‌లకు ఓచర్లకు ట్యాలీ కాకపోవటంతో ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. బదిలీపై వెళ్లిన కార్యదర్శి పాలకవర్గం చేసిన తప్పిదాలకు రికార్డులు సక్రమంగా నిర్వహించలేకపోయారనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.

సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక


భారతి


నిరంజన్

కొత్తకోట రూరల్: జిల్లా కేంద్రంలో డాక్టర్ బాలకిష్టయ్య క్రీడా మైదానంలో ఈ నెల 12న అథ్లెటిక్స్ అసోసియేషన్ సెలక్షన్ నిర్వహించారు. అందులో పెద్దమందడి మండలం మోజర్ల గ్రామ సమీపంలోని డాక్టర్ కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థులు భారతి, నిరంజన్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య తెలియజేశారు. అండర్–20 బాలికల విభాగంలో 400మీటర్ల పరుగు పందెంలో భారతి ప్రథమ స్థానంలో, అండర్–18 బాలుర విభాగంలో 600 మీటర్ల పరుగు పందెం విభాగంలో నిరంజన్ ద్వితీయ స్థానంలో నిలిచారు. వారు ఈ నెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపికై జిల్లాకు పేరు తీసుకురావాలని కళాశాల అధ్యాపక బృందం, తోటి విద్యార్థులు ఆకాంక్షించారు.

రూ.4లక్షల విలువ చేసే మద్యం చోరీ

● వినాయకుడి నిమజ్జనం రోజున సంఘటన
● బెల్టు దుకాణాలకు విక్రయించేందుకు వెళ్లగా పట్టుబడిన దొంగలు

కల్వకుర్తి టౌన్: వినాయకుడి నిమజ్జనం రోజున మద్యం దుకాణంలో చోరీ జరిగిన సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చోరీకి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని నాగర్‌కర్నూల్ చౌరస్తాలోని కనకదుర్గ వైన్స్‌లో సోమవారం అర్ధరాత్రి నిమజ్జనం ఉండటంతో అబ్కారీశాఖ అధికారులు మద్యం దుకాణాలకు సీల్ వేశారు. పట్టణమంతా నిమజ్జనం రోజున సందడిగా ఉండటంతో దొంగలు వారి చేతివాటాన్ని ప్రదర్శించారు. మద్యం దుకాణం వెనుకభాగం నుంచి వచ్చి, గోడకు రంధ్రం చేసి దుకాణంలోకి ప్రవేశించారు. దుకాణంలోని ఖరీదైన మద్యాన్ని సుమారు రూ.4 లక్షల విలువైన వాటిని ఎత్తుకెళ్లారు. మంగళవారం మద్యం దుకాణం తెరిచిన తర్వాత చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. ఖరీదైన మద్యం కావటంతో పట్టణంలోని బెల్టు దుకాణాల్లో దొంగలు గోవా, విదేశీ మద్యం పేరుతో బుధవారం అమ్మడానికి వెళ్లారు. బెల్టు దుకాణం వారికి అనుమానం వచ్చి, బాటిళ్లపై ఉన్న స్కానర్‌ను స్కాన్ చేయగా.. అవి కల్వకుర్తికి చెందిన వాటిగా గుర్తించి మద్యం దుకాణం వారికి సమాచారం ఇచ్చారు. వారు వెళ్లి నిందితులను పట్టుకొని వివరాలు ఆరా తీయగా.. మద్యం చోరీ చేశామని ఒప్పుకొన్నారు. దొంగలను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. దొంగతనం చేసిన వారు ప్రస్తుతం పోలీసుల ఆదుపులోనే ఉండగా.. వారి నుంచి మరిన్ని వివరాలను సేకరిస్తున్నారని సమాచారం. ఇదే ఘటనపై పోలీసులు ఎలాంటి సమాచారాన్ని బయటకు రాకుండా వ్యవహరిస్తున్నారని సమాచారం.

బీచుపల్లిని సందర్శించిన ఉడిపి మఠాధీశులు


బీచుపల్లిలో ఉడిపి పలిమారు మఠాధీశులు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి అభయాంజనేయస్వామి ఆలయాన్ని బుధవారం ఉడిపి పలిమారు మఠాధీశులు పనమపూజ్య విద్యాదీశ తీర్థులు సందర్శించారు. ఈ సందర్భంగా అభయాంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామన్‌గౌడ్, సిబ్బంది, అర్చకులు, పాలక మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మన్ననూర్: శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. అమ్రాబాద్ ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం.. శ్రీశైలం వైపు నుంచి వస్తున్న కారు, మన్ననూర్ వైపు వస్తున్న మోటారు బైక్ రహదారిపై ఎదురెదురుగా ఢీ కొన్నాయి. కాగా బైక్‌పై ఉన్న ముగ్గురిలో దానిని నడుపుతున్న కొర్ర గణేశ్ (25) అక్కడికక్కడే మృతి చెందగా కొర్ర సంతోష్, కొర్ర కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై అమ్రాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. క్షతగాత్రులను వైద్యం కోసం 108లో అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి పంపించారు. అదేవిధంగా గణేశ్ మృత దేహాన్ని అమ్రాబాద్ సివిల్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

జడ్చర్ల: జడ్చర్ల శివారులోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి రోడ్డు దాటుతున్న మహిళ దుర్మరణం చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రమోహన్ వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాలకు చెందిన పెబ్బేటి జ్యోతమ్మ(47) మంగళవారం అర్ధరాత్రి జడ్చర్ల శివారులోని 44వ జాతీయ రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె అల్లుడు పస్పుల పరమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు

● 123 గ్రాముల బంగారం స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఇజాజుద్దీన్

మహబూబ్‌నగర్ క్రైం: తాళం వేసిన ఇంట్లో దొంగతనం చేసిన ఆభరణాలను విక్రయిస్తున్న ఇద్దరు దొంగలను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఇజాజుద్దీన్ వివరాలు వెల్లడించారు. బోయపల్లికి చెందిన మొండి చిన్న, మండ్ల లక్ష్మి ఇద్దరు కలిసి పాత ఇనుప సామాన్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు. ఈ క్రమంలో ఈనెల 15న రాత్రి పట్టణంలోని పాత మోతీనగర్‌కు వెళ్లారు. అక్కడ తాళం వేసి ఉన్న ఓ ఇంటిని లక్ష్యంగా చేసుకుని ప్రధాన ముఖద్వారం తలుపు తాళం పగులగొట్టి లోపలికి వెళ్లారు. బీరువాలో ఉన్న 123.9 గ్రాముల బంగారం చోరీ చేశారు. బుధవారం పట్టణంలోని న్యూటౌన్‌లో చోరీ చేసిన బంగారం విక్రయించడానికి వెళ్లారు. ఈ ప్రయత్నంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ తెలిపారు. వారి నుంచి దాదాపు రూ.8లక్షల విలువ చేసే 123.9గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఏ1 మొండి చిన్న, ఏ2 మండ్లలక్ష్మిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఎస్‌ఐలు విజయ్‌కుమార్, ఓబుల్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శేఖర్, రఘునాథ్‌రెడ్డి, వెంకటరాములు ఉన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ ఇంట్లో దొంగతనం

11 తులాల బంగారం అపహరణ

జడ్చర్ల: తాళం వేసిన ఇంటిలో చోరీ చేసుకున్న సంఘటన మంగళవారం రాత్రి స్థానిక లక్ష్మి వెంకటేశ్వర కాలనీలో చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి కథనం మేరకు.. లక్ష్మి వెంకటేశ్వర కాలనీలో నివాసం ఉంటున్న ఏఆర్ కానిస్టేబుల్ సుంకసారి శ్రీహరి మంగళవారం విధులు ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు. అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి పట్టణంలోని తమ పాత ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటికి చేరుకునే సరికి ఇంటి తాళాలు విరగొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి గమనించగా బీరువాలో దాచిన 11 తులాల బంగారు నగలు కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణలో జాగ్రత్తలు


బావిలో పడిపోయిన వన్య ప్రాణిని కాపాడే విధానాలను తెలియజేస్తున్న రెస్క్యూ టీమ్ సభ్యులు

మన్ననూర్: వన్య ప్రాణుల సంరక్షణలో చేపట్టాల్సిన జాగ్రత్త చర్యల్లో భాగంగా చివరి రోజు క్షేత్ర పర్యటన చేసి ప్రత్యక్షంగా పాల్గొనే కార్యక్రమం నిర్వహించారు. మహారాష్ట్రకు చెందిన పూనే రెస్క్యూ టీమ్ సభ్యులు మూడు రోజుల పాటూ వన్య ప్రాణులను కాపాడటంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. బుధవారం నల్లమల అటవీ ప్రాంతంలోని దుర్వాసుల చెరువు సమీపంలో పాడుపడిన బావి వద్ద ఎఫ్‌డీఓ శివాణి డోగ్రా, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డి సమక్షంలో శిక్షకులు, అటవీశాఖ అధికారులు, సిబ్బంది పలు రకాల విన్యాసాలు చేశారు. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు వన్య ప్రాణి బావిలో పడినప్పుడు దాన్ని ఏవిధంగా రక్షించాలని ప్రయోగాత్మకంగా అవసరమైన పరికరాలను వినియోగించి వివరించారు. అనంతరం మూడు రోజులుగా నిర్వహించిన శిక్షణలో అటవీశాఖ సిబ్బంది గ్రహించిన విషయాలను ఈసీ సెంటర్‌లో రివ్యూ చేసినట్లు అటవీశాఖ అనుసంధాన ఎన్‌జీఓ బాపిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓలు, డీఆర్‌ఓలు, ఎఫ్ఎస్‌ఓలు, బీట్ ఆఫీసర్లు, వాచర్లు, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.

కల్లు ఆలస్యమైందని ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

గద్వాల క్రైం: కల్లు ఆలస్యమైందని కలత చెంది ఉరేసుకుని ఓ మహిళ మృతి చెందిన ఘటన బుధవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం మేరకు.. పట్టణంలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన సుజాత (35) దోబీ వృత్తి చేస్తూ జీవనం సాగిస్తుండేది. ఆమెకు కల్లు తాగే వ్యాపకం ఉంది. అయితే మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు కల్లు తీసుకురావడం ఆలస్యం కావడంతో వింతగా అరుస్తూ మానసికంగా కుంగిపోయింది. ఇంట్లో ఎవరు లేకపోవడంతో చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుని అపస్మారక స్థితిలో పడింది. బయటి నుంచి ఇంట్లోకి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం హుటా హుటిన జిల్లా ప్రభుత్వాస్పత్రికిఆ తరలించారు. కాగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి గోకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. అయితే ఇది ఇలా ఉండగా భర్త వేధింపుల కారణంగా మహిళ ఉరేసుకున్నట్లు కాలనీ వాసులు చెబుతున్నారు.

మద్యానికి బానిసై..

జడ్చర్ల: మద్యానికి బానిసైన మహిళ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ నాగేశ్వర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన సునీత(51) మద్యానికి బానిసైంది. దీంతో మానసిక ఆందోళనకు గురై మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. బుధవారం ఆమె కూతురు కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

దాడికి గురైన వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని మోతీనగర్‌లో ఈ నెల 14న దాడికి గురైన కురుమూర్తి (42) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. టూటౌన్ సీఐ ఇజాజుద్దీన్ వివరాల మేరకు.. మోతీనగర్‌కు చెందిన కురుమూర్తి సోదరి అదే ఏరియాలో ఒంటరిగా నివాసం ఉంటోంది. 15 రోజుల క్రితం ఆమెను మోతీనగర్‌కు చెందిన గొల్ల కిష్టయ్య, మరికొందరు అకారణంగా దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో బాధిత కుటుంబ సభ్యులు సదరు వ్యక్తుల నుంచి రూ. 15 వేల జరిమానా కట్టించుకున్నారు. ఈ నెల 14న మరోసారి ఆమెపై దాడి చేసేందుకు యత్నించగా.. భయాందోళనకు గురై కురుమూర్తి ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో కురుమూర్తిపై గొల్ల కిష్టయ్యతో పాటు మరికొందరు దాడికి పాల్పడటంతో తలకు తీవ్ర గాయమైంది. అతడిని చికిత్స నిమిత్తం మొదట జిల్లా జనరల్ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. తలలో రక్తం గడ్డ కట్టడంతో కోమాలోకి వెళ్లిన కురుమూర్తి.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు నిందితులపై హత్య, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

గోల్డ్‌స్మిత్ షాప్‌లో..



హన్వాడ: మండల కేంద్రంలోని గోల్డ్‌స్మిత్ షాపులో చోరీ జరిగినట్లు ఎస్‌ఐ వెంకటేష్ బుధవారం తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని టంకర గ్రామానికి చెందిన అవుసుల కృష్ణయ్య మండల కేంద్రంలో రెండేళ్లుగా గోల్డ్‌స్మిత్ షాపును నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షాపు తాళాలు పగులగొట్టి షాపులో రెండు తులాల బంగారం, 30తులాల వెండి సామగ్రిని చోరీ చేశారు. బుధవారం ఉదయం షాపుకు ఎప్పటిలా వచ్చిన కృష్ణయ్య షాపులో చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నారాయణపేట జెండా లొల్లి

● ఇరు వర్గాల మధ్య గొడవ.. రాళ్లతో దాడులు
● పోలీసుల లాఠీచార్జ్


వీర సావర్కర్ చౌరస్తాలో పికెటింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

నారాయణపేట రూరల్: జిల్లాకేంద్రంలో బుధవారం రాత్రి ఉద్రిక్తత చోటుచేసుకుంది. జెండా వివాదం రెండు వర్గాల మధ్య రాళ్ల రువ్వుకోవడంతో దాదాపు మూడు గంటల పాటు ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి.. పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేటలోని వీర సావర్కర్ చౌరస్తాలో ఓ వర్గానికి చెందిన జెండా చాలా ఏళ్లుగా ఉంది. అయితే అక్కడ మరో వర్గం వారు తమ జెండాను ఏర్పాటు చేయడానికి బుధవారం రాత్రి ప్రయత్నం చేశారు. అక్కడ గతంలో ఉన్న జెండాను తీసి మరో వర్గం వారు తమ జెండా పెట్టడంతో గొడవకు దారి తీసింది. పోలీసులు కలగచేసుకుని ఇరువురిని అక్కడి నుంచి చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఆందోళనకారులు రాళ్లు, చెప్పులు విసరడంతో వెనక్కి తగ్గిన పోలీసులు.. ప్రత్యేక బలగాలను రప్పించారు. పరిస్థితి అదుపు తప్పుతుండడంతో లాఠీచార్జ్ చేసి, ఆందోళన చేస్తున్న వారిని అక్కడి నుంచి తరిమేశారు. ఇతర జిల్లాల నుంచి పోలీసు బలగాలు పెద్ద ఎత్తున మోహరించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. పట్టణంలో పికెటింగ్ కొనసాగుతుంది.

ఎర్రగుట్టలో చిరుత సంచారం

జడ్చర్ల: బాదేపల్లి శివారులోని ఎర్రగుట్ట డబుల్‌బెడ్ రూం ఇళ్ల వద్ద మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత చిరుత కనిపించిందని స్థానికుడు రాజా దశరథ్ తెలిపారు. రాత్రి ఒంటిగంట సమయంలో తాను బయటికి రాగా చిరుత కనిపించడంతో మొబైల్‌లో వీడియో వివరించారు. కాగా చిరుత సంచారంపై ఎర్రగుట్ట ప్రాంత వాసులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తమకు ఎలాంటి ఆపదా రాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.